క్లుప్తంగా

ఈ-క్రాప్‌లో అభ్యంతరాలు తెలపండి

పుత్తూరు: ఈ-క్రాప్ ముసాయిదా జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 3వ తేదీ లోపు తెలపాలని వడమాలపేట మండల వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో రబీ 2023–24 సీజన్‌లో 623 మంది రైతులకు 2292 ఎకరాల్లోని పంటల సాగుపై ఈ-క్రాప్ నమోదు పూర్తి చేశామని, దీనికి సంబంధించి మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 3వ తేదీ వరకు ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శిస్తున్నట్టు తెలియజేశారు. అలాగే ఆర్బీకే సిబ్బంది గ్రామ సభలు నిర్వహించి రైతుల క్రాప్ నమోదు వివరాలను తెలియజేస్తారని, అభ్యంతరాలు ఉంటే రైతు భరోసా కేంద్రాల్లో రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు.

జెడ్పీ హైస్కూల్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ

నింద్ర: మండలంలోని చవరంబాకం జెడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం ఎంఈఓ శ్రీధర్ రాజు తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. సిలబస్ ఎంతవరకు చెప్పారో విద్యార్థులను అడిగి తెలుసుకోవడంతోపాటు వారి విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించే దిశగా టీచర్లు పాఠాలు బోధించాలని, వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు.

ఆత్మరక్షణ కోసమే కరాటే



విద్యార్థులకు బెల్టు, సర్టిఫికెట్ ఇస్తున్న కరాటే మాస్టర్ గుణ

పాలసముద్రం : విద్యార్థినుల ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యం, కరాటే మాస్టర్ గుణ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం విద్యార్థులకు జపాన్ షిటో కరాటే ఇండియా వారి ఆధ్వర్యంలో కరాటే పోటీలు నిర్వహించారు. కరాటే మాస్టర్ గుణ మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థినులకు కరాటే ఎంతో అవసరమని చెప్పారు. విద్యార్థులు తీవ్ర ఒత్తిడిని అధిగమించేందుకు తల్లిదండ్రులు కరాటేను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సినీ ఫైట్ మాస్టర్ రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్రౌపదమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తి ప్రపత్తులతో పాలాభిషేకం చేశారు. వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో అమ్మవారిని ముస్తాబు చేసి, విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ల పంపిణీ



తిరుపతికి వెళ్లి పింఛన్ ఇస్తున్న ఆశాజ్యోతి

కార్వేటినగరం: మండల పరిధిలోని ఆర్కేవీబీ పేటకు చెందిన రామయ్య కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతి బర్డ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు పింఛన్ అందించేందుకు వలంటీరు ఆశాజ్యోతి తిరుపతికి వెళ్లి అందించారు. మండల పరిధిలోని కొల్లాగుంట గ్రామానికి చెందిన వనిత ముక్కు శస్త్ర చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. సమాచారాన్ని అందుకున్న వలంటీర్ భార్గవి చిత్తూరుకు వెళ్లి పింఛన్ అందించారు.



చిత్తూరుకు వెళ్లి పింఛన్ అందిస్తున్న భార్గవి

విద్యార్థులకు స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణ



స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు

పుత్తూరు: ప్రతి విద్యార్థి స్కౌట్ అండ్ గైడ్స్ ద్వారా శిక్షణ పొందాలని స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎ.భువనేశ్వరి అన్నారు. శుక్రవారం పాఠశాలలో కొత్తగా మూడు గైడ్స్ యూనిట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో యూనిట్‌కు 32 మంది విద్యార్థుల చొప్పున ఎంపిక చేశారు. వీరందరికీ జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ ఆర్గనైజింగ్ కమిషనర్ ఏ.వెంకటేశ్వర్లు శిక్షణ ప్రారంభించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే క్రమశిక్షణకు అలవాటు పడాలని, అందుకు స్కౌట్ అండ్ గైడ్స్ మంచి వేదిక అన్నారు. చిన్నతనం నుంచి సమాజ సేవ చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. స్కౌట్ అండ్ గైడ్స్‌లో చేరితో క్రమశిక్షణతో కూడిన సేవామార్గంలో పయనించవచ్చన్నారు. సమాజానికి తమవంతుగా ఏం చేయాలో స్పష్టమైన అవగాహన కలుగుతుందని, అంతే కాకుండా శారీరక, మానసిక దృఢత్వాన్ని పొందుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ గైడ్స్ లీడర్లు చారులత, దీపిక, గీతిక, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థి నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న హెచ్‌ఎం భువనేశ్వరి

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐలు



వెంకటేశ్వర్లు

వెదురుకుప్పం: మండల పోలీస్‌స్టేషన్‌కు కొత్త సబ్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న రమేష్‌బాబు ఐరాలకు బదిలీ చేశారు. ఐరాలలో పనిచేస్తున్న వెంకటేశ్వర్లు ఇక్కడికి వచ్చారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఎస్సార్‌పురం ఎస్‌ఐగా రాజపుల్లయప్ప



రాజపుల్లయప్ప

శ్రీరంగరాజపురం : మండలానికి నూతన ఎస్‌ఐగా రాజపుల్లయప్ప బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తామన్నారు. అక్రమ రవాణా, సారా స్థావరాలపై సమూలంగా నిర్మూలిస్తామని స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించి, నేరాలను అరికట్టడానికి కృషి చేస్తానన్నారు.

కార్వేటినగరం ఎస్‌ఐగా వెంకటకృష్ణ

కార్వేటినగరం: ఎన్నికల్లో బదిలీల్లో భాగంగా కార్వేటినగరానికి ఎస్‌ఐగా వచ్చిన వెంకటకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చిత్తూరు వీఆర్ నుంచి కార్వేటినగరం పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్.ఐ దస్తగిరి సీఐగా పదోన్నతిపై వెళ్లారు. పోలీస్ సిబ్బంది ఎస్‌ఐకి శాలువలు కప్పి సత్కరించారు.



వెంకటకృష్ణ

పెనుమూరు ఎస్.ఐగా లోకేష్



లోకేష్

చిత్తూరు వీఆర్ నుంచి పెనుమూరు ఎస్‌ఐగా వచ్చిన లోకేష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ గతంలో ఎస్‌ఐగా ఉన్న అనిల్‌కుమార్ చిత్తూరు స్పెషల్ బ్రాంచికి బదిలీ అయ్యారు. ఎస్‌ఐ లోకేష్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తానని, అన్నిరకాల జూదాన్ని అరికడతానని తెలిపారు.

నింద్ర ఎస్‌ఐగా రామచంద్ర



రామచంద్ర

నింద్ర: నింద్ర ఎస్‌ఐగా రామచంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో ప్ర భుత్వం చేసిన బదిలీలలో తాను చిత్తూరు నుంచి ఇ క్కడికి వచ్చినట్టు ఆయన చెప్పారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని కోరారు.

ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ

పుత్తూరు: పట్టణ ప్రజలు ఆస్తి పన్ను బకాయిలను ఈనెల 31వ తేదీ లోపు పూర్తిగా చెల్లిస్తే వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని మున్సిపల్ కమిషనర్ కెఎల్ ఎన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి, ఖాళీ జాగాలకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న పన్ను బకాయిలను పూర్తిగా చెల్లించిన వారికి వడ్డీ మాఫీని ప్రభుత్వం ప్రకటించిందని వెల్లడించారు. పన్ను చెల్లించు వారు మున్సిపల్ కార్యాలయంలోని క్యాష్ కౌంటర్‌లో నేరులో గానీ ఆన్‌లైన్/నెట్ బ్యాంకింగ్/ డెబిట్/క్రెడిట్ కార్డు/యూపీఐ ద్వారా చెల్లించవచ్చని తెలియజేశారు.

తమిళనాడు సీఎం స్టాలిన్ జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న డీఎంకే పార్టీ నాయకులు

నగరి: తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ జన్మదిన వేడుకలను నగరి పట్టణంలోని డీఎంకే పార్టీ నాయకులు శుక్రవారం పుదుపేటలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు పేదలకు అన్నదానం చేశారు. స్టాలిన్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

దిశ యాప్‌పై అవగాహన

పాలసముద్రం : దిశ యాప్‌పై గ్రామంలో ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు. ఆముదాల దళితవాడలో శుక్రవారం ఆయన గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఎస్‌ఐ ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు మొబైల్స్‌లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం దిశ యాప్ పనితీరు, ప్రయోజనాలను వివరించారు. గ్రామాల్లో సైబర్ నేరగాళ్లు బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామంటూ ఫోన్‌చేసి మీ ఖాతా యాక్టివ్‌లో లేదని, పాన్ నంబర్, ఖాతా వివరాలు, ఓటీపీలు చెప్పాలని కోరినా స్పందించవద్దని సూచించారు. రుణాలు ఇస్తామని సెల్‌ఫోన్లకు వచ్చే సందేశాలకు స్పందించరాదని తెలిపారు. ముఖ్యంగా గ్రామల్లో ప్రజలు కలసి మెలసి ఉండాలని, రాజకీయ కక్షలు పెంచుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ చక్రవర్తి, మురుగేష్, పోలీస్ పాల్గొన్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ప్రసాద్

స్త్రీనిధిని మెరుగుపరచాలి

పాలసముద్రం : ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు సత్వర రుణాలను అందిస్తూ లాభాల బాటలో నడుస్తున్న ఏకైక సహకార సంస్థ స్త్రీనిధి అని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం డ్వాక్రా సంఘాల లీడరు, సంఘమిత్ర, వీఓ లీడర్, సీసీలకు ఆయన సమావేశం నిర్వహించారు. ఏపీఎం ఫరీద్ మస్తాన్ మాట్లాడుతూ ప్రభుత్వం మరిన్ని రుణాలు అందించేలా స్త్రీనిధి సంస్థను మెరు గు పరిచే బాధ్యత మహిళలపై ఉందన్నారు. వడ్డీ లేని రుణాలను సంఘ సభ్యులు సద్వినియో గం చేసుకుని అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. సీసీ చిరంజీవి, సంఘమిత్ర, శోభ, మంజుల, మురగయ్య, బాలయ్య, మంజుల పాల్గొన్నారు.

• కుంభాభిషేకం

నగరి: మండలంలో గుండ్రాజుకుప్పంలోని సీతారాముల ఆలయంలో శుక్రవారం నూతన పంచలోహ విగ్రహాల ప్రతిష్ఠ, కుంభాభిషేకం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉత్సవమూర్తులకు చేసిన ప్రత్యేక అలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. ధూప దీప నైవేద్యాల సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం కల్యాణోత్సవం నిర్వహించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు రుత్వికులు వెంకట్రామ ప్రసాద్‌శర్మ, కుమార్‌స్వామి అక్షింతలు, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామ సర్పంచ్ బాలప్రసాద్ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో భక్తులు

చిత్తూరు రైల్వేస్టేషన్‌కు మహర్దశ

- అమృత్‌భారత్ పథకం కింద ఎంపిక
- రూ.13.99 కోట్లతో అభివృద్ధి
- ప్రయాణికులకు మౌలిక వసతుల కల్పన
- ఫలించిన ఎంపీ రెడ్డెప్ప కృషి



నూతన స్టేషన్ నమూనా చిత్రం



చిత్తూరు రైల్వే స్టేషన్‌లో చేస్తున్న పనులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా కేంద్రం చిత్తూరులోని రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. అమృత్ భారత్ పథకం కింద ఎంపికైంది. దీంతో రూ.13.99 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ స్టేషన్‌కు దాదాపు 125 ఏళ్ల చరిత్ర ఉంది. కానీ వసతులు, సదుపాయాలు లేవు. ఈ క్రమంలో ఎంపీ రెడ్డెప్ప చొరవతో చిత్తూరు రైల్వేస్టేషన్ రూపురేఖలు మారనున్నాయి.

గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని 17 రైల్వే స్టేషన్లు అమృత్ భారత్ పథకం కింద ఎంపికయ్యాయి. వాటిలో చిత్తూరు రైల్వేస్టేషన్ కూడా ఉంది. దీన్ని మరో మోడల్ స్టేషన్‌గా తీర్చి దిద్దేందుకు కేంద్రం ప్రణాళికలు తయారుచేసింది. రూ.13.99 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఫిబ్రవరి 26వ తేదీన ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో పనులను ప్రారంభించారు. కేంద్రం ప్రతిపాదించిన సదుపాయాలను ప్రయాణికులకు కల్పించేందుకు పనులు వేగంగా సాగుతున్నాయి. ఇందుకు సంబంధించిన మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించి పర్యవేక్షణకు 'గతి శక్తి' పేరుతో టాస్క్‌ఫోర్స్ నిపుణుల కమిటీలను ఏర్పాటు చేసింది. బడ్జెట్ ప్రతిపాదించిన విధంగా రాష్ట్రంలో అమృత్ భారత్ స్టేషన్లను పూర్తి స్థాయిలో ఆధునీకరించనున్నారు. ఇప్పటికే చిత్తూరు రైల్వేస్టేషన్‌ను పలువురు ఉన్నతాధికారులు పరిశీలించి చేపట్టాల్సిన పనులు, కల్పించాల్సిన సౌకర్యాలను గుర్తించి నివేదించారు.

కల్పించనున్న సౌకర్యాలు

- ప్రస్తుతం ఉన్న భవనాన్ని పడగొట్టి దాని వెనుక (పార్కు) ముందు కొత్త భవనంను ఏర్పాటు చేయనున్నారు.
- స్టేషన్‌లో ఫ్లోరింగ్, భవనాలు ఆధునికతను చాటిలా నిర్మించనున్నారు.
- ఇప్పుడున్న ప్లాట్‌ఫాంతో పాటు అదనంగా మరో ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేయనున్నారు.
- ప్రస్తుతమున్న ప్లాట్‌ఫాం పొడవును మరింత పొడిగించనున్నారు. ప్లాట్‌ఫాం వెనుక ప్రత్యేక రూఫ్ షెడ్లు ఏర్పాటు చేయనున్నారు.
- వెయిటింగ్ హాల్స్, కెఫెటేరియాలు నాణ్యమైన సేవలను అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.
- స్టేషన్‌కు రెండు వైపులా అప్రోచ్ రోడ్లు, ప్రత్యేక పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయనున్నారు.
- ప్రయాణికుల వాహనాలు సులభంగా వెళ్లడానికి, రావడానికి ద్వారాలను సిద్ధం చేస్తారు.
- దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ప్రవేశ మార్గాలు, వీల్ చైర్స్, గ్రౌండ్ వాటర్ ట్యాప్ తదితర సదుపాయాలు కల్పించనున్నారు.
- మహిళలు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగుల కోసం కొత్తగా లిఫ్టును ఏర్పాటు చేయనున్నారు.
- వేగవంతమైన వైఫై సేవలకు 5 జీ ఏర్పాటు చేస్తారు.
- వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ అనే నినాదాన్ని సఫలీకృతం చేస్తూ స్థానిక ఉత్పత్తుల విక్రయానికి పెద్దపీట వేస్తూ స్టేషన్‌లో కనీసం రెండు స్టాళ్లను ఏర్పాటు చేస్తారు.

వేగంగా ఆధునీకరణ పనులు

చిత్తూరు రైల్వే స్టేషన్‌ను అత్యంత సుందరంగా, ఆధునాతనంగా రైల్వేశాఖ తీర్చిదిద్దుతుంది. చిత్తూరు ప్రయాణికులకు మరింత సులభతరమైన, సౌకర్యవంతమైన సదుపాయాలను కల్పించేలా పనులు చేయనున్నారు. ముఖ్యంగా ఫ్లోరింగ్, పార్కింగ్, లిఫ్ట్, రూఫ్ తదితర సదుపాయాలు త్వరలో అందుబాటులోకి వస్తాయి.

–వెంకటేష్, రైల్వే జిల్లా వాణిజ్య ఇన్‌స్పెక్టర్

ఆకట్టుకుంటున్న ఏకపాదమూర్తి



అఘోరీలు పూజిస్తున్న మహాశివుడు

నగరి: మునిసిపల్ పరిధి కీళపట్టు త్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వర ఆలయ ఆవరణలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని స్వామివారి వినూత్న రూపాలు చేయడం పరిపాటి. దీనికి సంబంధించి ఈ ఏడాది నిర్మించిన 9 అడుగుల ఎత్తు ఉన్న ఏకపాదమూర్తి ప్రతిమ, అఘోరీ శివుని విగ్రహం ముందు తపస్సు చేస్తున్న ప్రతిమలు పలువురినీ ఆకర్షిస్తున్నాయి. ఈ విగ్రహాన్ని స్థానిక భక్తుడు గణేశ్ అతనితో పాటు స్థానిక యువకులు నెల పాటు శ్రమించి తయారుచేశారు. శివుని ముందు తపస్సు చేసిన అఘోరీలకు శివుడు, బ్రహ్మ, విష్ణువు ఒక్కటే అని చెప్పేలా శివుడు ఏకపాదంలో మూడు రూపాలు ధరించి సాక్షాత్కరించడమే ఏకపాదమూర్తి అవతారమని ఆలయ నిర్వాహకులు జలగండా సుబ్రమణ్యం తెలిపారు. శివుని ఆకారానికి రుద్రాక్షలు, మహావిష్ణువు ఆకారానికి తులసి పూసలు, బ్రహ్మ ఆకారానికి తామర గింజలు వాడినట్లు తెలిపారు.



9 అడుగుల ఎత్తు ఉన్న గజసంహార మూర్తి

ఆరోగ్య సమాజమే ప్రభుత్వ లక్ష్యం



పౌష్టికాహార స్టాల్‌లో ఎంపీడీవో వెంకటేశ్వరరావు

పెనుమూరు(కార్వేటినగరం): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో వెంకటేశ్వరరావు అన్నారు. గంగుపల్లి సచివాలయం ఆవరణంలో శుక్రవారం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపీడీవో మాట్లాడుతూ జగనన్న విద్య, వైద్యానికి పెద్ద పీట వేశారని గుర్తు చేశారు. గ్రామాల్లో ప్రభుత్వం చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు తిరుణాళ్లను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. రోగులు అత్యధికంగా తరలివచ్చి చికిత్స పొందుతున్నారని అన్నారు. జగనన్న వైద్యరంగానికి అత్యధిక నిధులు కేటాయించి, గ్రామాల్లో వ్యాధులున్న వారిని జల్లెడ పడుతున్నారని అన్నారు. అనంతరం కంటి అద్దాలు పంపిణీ చేశారు. అనంతరం శిబిరంలో అంగన్‌వాడీ సిబ్బందిది ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సీతారామరాజు, హర్షవర్ధన్‌రెడ్డి, రాజశేఖర్, వెంకటేశ్వర్‌నాయుడు, ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

నగరి: ఇంటర్మీడియెట్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మున్సిపల్ పరిధిలో ఇంటర్ విద్యార్థులకు 3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. తొలిపరీక్ష కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కేంద్రాల వద్దకు వచ్చారు. అన్ని కేంద్రాల్లోను పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం తెలుగు పరీక్షలకు 57 మందికి గానూ ఇద్దరు గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ధనంజయ తెలిపారు. పరీక్ష కేంద్రంలో అన్ని వసతులు సమకూర్చి, పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. విద్యార్థులను తనిఖీ చేసిన తరువాతనే కేంద్రంలోకి అనుమతించినట్లు తెలిపారు.



పాలసముద్రం : విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు



ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం నుంచి వెలుపలకు వస్తున్న విద్యార్థులు

ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలు

ఐరాల: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాలతో కాణిపాకం ఇండియన్ బ్యాంకు శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు జిల్లా లీడ్ మేనేజర్ హరీష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆర్థిక పరమైన లావాదేవీలు, డిజిటల్ చెల్లింపులు, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తొలుతగా ప్రతి విద్యార్థికి పైఅంశాలపై మూడు రకాల పుస్తకాలు, టీ-చొక్కాలు, క్యాప్‌లు, పెన్నులు ఆయన అందించారు. విద్యార్థులతో కలిసి కాణిపాకం పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కాణిపాకం బ్రాంచ్ మేనేజర్ సాగర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే పొదుపు లక్షణాలు అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ జీరో బ్యాలెన్స్‌తో ఖాతాలను తెరచుకొని భవిష్యత్ కోసం పొదుపు చేసుకోవాలని పిలుపునిచ్చారు. దీనిపై పాఠశాల విద్యార్థులకు పరీక్ష పోటీలు నిర్వహించారు. పరీక్షల్లో విజేతలైన ఇద్దరు విద్యార్థులకు ప్రథమ బహుమతి కింద రూ.4 వేలు చొప్పున, ద్వితీయ బహుమతి కింద ఇద్దరు విద్యార్థులకు రూ.3 వేలు చొప్పున, తృతీయ బహుమతికి ఎంపిక చేసిన ఇద్దరు విద్యార్థులకు రూ.2 వేలు అందజేశారు. కార్యక్రమంలో సోమశేఖర్‌నాయుడు, సురేష్ బాబు, సురేంద్రబాబు, సతీష్, హషీమ్, బాలయ్య, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

పోలియో రహిత సమాజస్థాపనకు కృషి

తవణంపల్లె: పోలియో రహిత సమాజస్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ ప్రియాంక అన్నారు. జాతీయ పల్స్‌పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకుని, శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో మహమ్మారిని తరిమికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఈ-పంట నమోదుపై సామాజిక తనిఖీ

గుడిపాల: ఈ-పంట నమోదుపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. మండలంలోని పాపసముద్రం రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రబీలో పంటలు వేసుకున్న రైతుల వివరాలన్నింటినీ వారికి చదివి వినిపించారు. వీటిలో మార్పులు, చేర్పులు ఉన్నట్లయితే మార్చి 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అభ్యంతరాలను నమోదు చేసి తుది జాబితాను రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఈ పంట నమోదు ఆధారంగానే రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ పంట రుణాలు, వ్యవసాయ యాంత్రీకరణ, రైతు భరోసా-పీఎం కిసాన్ పథకాలు వర్తిస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వళ్లియమ్మ, అగ్రికల్చర్ అసిస్టెంట్ తులసీరాంరెడ్డి పాల్గొన్నారు.